
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జిన్నర్ల విముఖత

రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లా పత్తి సాగులో మొదటి స్థానంలో ఉంది. ఇప్పటికే బోరు బావుల కింద, ముందస్తు వర్షాలకు పత్తిని మార్కెట్‌కు విక్రయానికి తీసుకొస్తున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో పత్తి ధరలు రోజురోజుకు దిగజారుతున్నాయి. క్వింటాలు గరిష్ఠంగా రూ.7500 మించి రైతులకు అందడం లేదు. అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది ముందుగానే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ని రంగంలోకి దించి కనీస మద్దతు ధరతో రైతులను ఆదుకోవాలని చూస్తోంది. సీసీఐ నిబంధనలను సడలిస్తే తప్ప తాము అద్దెకు ఇవ్వలేమని జిన్నింగ్ పరిశ్రమల యజమానులు చెబుతున్నారు.



ఆదోని పత్తి జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమ

- కొర్రీలు విధించిన సీసీఐ
- పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రతిష్టంభన
- రోజురోజుకు పతనమవుతున్న ధరలు
- ఆందోళనలో అన్నదాతలు



పరిశ్రమలో ఉత్పత్తి అయిన దూది బేళ్లు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీసీఐకి అద్దెకిచ్చేందుకు పత్తి జిన్నింగ్ పరిశ్రమలు విముఖత చూపుతున్నాయి. ఇప్పటికే మూడుసార్లు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జిన్నింగ్ పరిశ్రమలకు టెండర్లను ఆహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కరు కూడా టెండర్లు దాఖలు చేయలేదు. ఈనెల 27వ తేదీ వరకు టెండర్లను పొడిగించింది. రాష్ట్రప్రభుత్వం ఓవైపు సీసీఐ ఉన్నతాధికారులతో నిబం ధనలు నడలించి కొనుగోలు చేయాలని ప్రయత్నాలు చేస్తుంది. నిబంధనలు సడలిస్తే తప్ప తాము టెండర్లలో పాల్గొనమని పత్తి పరిశ్రమల యజమానులు కరాఖండిగా చెబుతున్నారు.



రూ.7500కు మించి కొనుగోలు..

ఉమ్మడి కర్నూలు జిల్లా పత్తి సాగులో మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.45లక్షల హెక్టార్లకు పైగా రైతులు పత్తి సాగుచేశారు. 38-45లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే బోరు బావుల కింద, ముందస్తు వర్షాలకు పత్తి మార్కెట్‌కు విక్రయానికి తీసుకొస్తున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు రోజురోజుకి దిగజారు తున్నాయి.

మిగతా 5వ పేజీలో

ఉల్లిపంట తొలగింపు

- గిట్టుబాటు ధర లేక దున్నేస్తున్న రైతులు



చింతలచెరువులో ఉల్లి పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు

చాగలమర్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టపోతున్నారు. ఈ ఏడాది ఉల్లి ధర ఘోరంగా పతనమైంది. దీంతో రైతులు దిక్కుతోచక పొలాల్లోనే ఉల్లిని వదిలేయగా మరి కొందరు పంటను దున్నేస్తున్నారు. ఆదివారం నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామంలో మనోహర్‌రెడ్డి అనే రైతు సాగు చేసిన 2 ఎకరాల ఉల్లిపంటను ట్రాక్టర్‌తో దున్నేశారు. చిన్నవంగలి గ్రామంలో లక్ష్మీనారాయణరెడ్డి సాగు చేసిన 2 ఎకరాల ఉల్లి పంటను వదిలేశారు. కోసిన పంటను ప్రజలు సంచులకు నింపుకొని తీసుకెళ్లారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించక పోవడంతో పంటను ఇలా వదిలేయాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట కోతకు కూడా రూ.15 వేలు ఖర్చు చేశారు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టి మూడు నెలల పాటు పంటను కాపాడుకుంటూ వస్తే ధర పతనమైంది. కిలో రూ.2 కూడా పలకకపోవడంతో పంటను వదిలేసుకోవాల్సి వచ్చిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.



చిన్నవంగలిలో ఉల్లిగడ్డలను సంచులకు నింపుకుంటున్న మహిళలు

దేవరగట్టుపై శివనాదం

- ఆకట్టుకున్నగొరవయ్యల నృత్యం
- 4వ ప్రయత్నంలో తెగిన ఇనుప గొలుసు
- నేటితో బన్ని ఉత్సవాల ముగింపు



దేవరగట్టులో ఇనుప గొలుసు తెంపుతున్న గొరవయ్య గాదిలింగ

హొళగుంద, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. దేవరగట్టుపై శివనాదం మార్మోగింది. ఆదివారం దేవరగట్టులో జరిగిన గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టంగా భావించే గొలుసు తెంపే ఉత్సవాన్ని చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అర్చకులు నిర్ణయించిన సమయం ఉదయం 9 గంటలకు బల్లారుకు చెందిన గొరవయ్య గాదిలింగ ఇనుప గొలుసును 4వ ప్రయత్నంలో తెంపి ఔరా అనిపించారు. దేవరగట్టు పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం దేవదాసీల క్రీడలు సైతం ఆకర్షణీయంగా సాగాయి. బన్ని ఉత్సవాల్లో సోమవారం చివరి ఘట్టమైన వసంతోత్సవంలో భక్తులపై



గొరవయ్యలు రంగులను చల్లి ఘనంగా కంకణ విసర్జన చేపడతారు. దీంతో బన్ని ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి, హొళగుంద, హాలహర్వి, తుగ్గలి ఎస్‌ఐలు గురజాల దిలీప్ కుమార్, మారుతి, బాలనరసింహులు పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోస్ట్ మల్లికార్జున, కురువ సోమప్ప, వీర నాగప్ప, రాజశేఖర్, వైసీసీ నాయకులు ఎస్‌కే గిరి, రామునాయక్ పాల్గొన్నారు.



భైరవ అవతారంలో పంచామృతం తాగుతున్న గొరవయ్యలు



దేవర గట్టులో నృత్యం చేస్తున్న గుణ్ణప్పు మొకం వారు

ముగిసిన రాష్ట్రస్థాయి జల క్రీడలు
5
దేశ సమైక్యతే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

అవుకు సమస్యకు శాశ్వత పరిష్కారం

- రిజర్వాయర్ మరమ్మతులకు రూ.కోటి
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ



రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ

అవుకు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. అవుకు రిజర్వాయర్ భద్రతపై ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మంత్రి బీసీ స్పందించారు. వెంటనే ఆయన ఎస్సార్బీసీ అధికారులతో కలసి రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. కుంగిన ఎర్రరాతి రివిట్‌మెంట్ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ పాలేరు చెరువు, తిమ్మరాజు చెరువుకు గతంలో ఉన్న తూముల వద్ద నిర్మాణ లోపం జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు లోపలి భాగంలోని రివిట్‌మెంట్ ఏడాది వ్యవధిలోనే రెండోసారి కుంగిపోయిందన్నారు. గత ఏడాది రివిట్‌మెంట్ కుంగినప్పుడు జలవనరులశాఖ సీఈసీడీవో కుమార్ పరిశీలించారు. ఆయన సూచనల మేరకు మరమ్మతుల కోసం ఎస్సార్బీసీ అధికారులు రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా రూ. కోటి నిధులను మంజూరు చేశామన్నారు. టెండర్ల ప్రక్రియతో పాటు అగ్రిమెంట్ పూర్తయిందన్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ 4.148 టీఎంసీలు కాగా 3.5 టీఎంసీల నీరు చేరితే పాత తూము వద్ద మాత్రమే రివిట్‌మెంట్ కుంగుతుందన్నారు. భద్రతలో భాగంగా రిజర్వాయర్ నుంచి చెర్లోపల్లె సమీపంలోని జీఎన్‌ఎస్‌ఎస్ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా కడప జిల్లాకు 12 వేలు క్యూసెక్కుల నీటిని తరలించాలన్నారు. రిజర్వాయర్‌లో నీరు తగ్గిన వెంటనే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గోరుకల్లు రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటి నిల్వ ఉందని, వచ్చే సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందిస్తామన్నారు. రిజర్వాయర్‌కు ముప్పు లేదని దిగువ గ్రామాల్లోని రైతులు, ప్రజలు ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో కడప జిల్లా జీఎన్‌ఎస్‌ఎస్ ఈఈ చంద్రమోహన్, ఎస్సార్బీసీ ఈఈ శుభకుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయ భాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, టీడీపీ నాయకులు వెంకటరమణనాయక్, అరుణ్‌కుమార్‌నాయక్, రమణ, తిక్కన్న, పుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

శ్రీగిరిపై భక్తజన సందోహం

శ్రీశైలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దసరా సెలవులతో పాటు వారాంతం కావడంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు వేలసంఖ్యలో శ్రీగిరికి చేరుకున్నారు. దీంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లు నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకున్న అధికారులు ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చనలు నిలుపుదల చేశారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, దర్శనాల ద్వారా భక్తులు మల్లికార్జునస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆన్‌లైన్‌లో ముందుగా దరఖాస్తు చేస్తున్న వారికి మాత్రమే వీఐపీ బ్రేక్, స్పర్శ దర్శనాలను కల్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



క్యూలైన్లో భక్తులు



మూసివేసిన డ్యాం గేట్లు

శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేత

శ్రీశైలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. దీంతో ఆదివారం డ్యాం అధికారులు గేట్లను మూసివేశారు. శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 884 అడుగులుగా నమోదైంది. అదేవిధంగా 215 టీఎంసీల సామర్థ్యం ఉన్న డ్యాంలో ప్రస్తుతం 210 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాలైన జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 1,45,300 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 61,853 క్యూసెక్కుల నీటిని డ్యాం అధికారులు విడుదల చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ రాజకుమారి ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. దరఖాస్తుల స్టేటస్‌ను తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

పీఎం, సీఎం పర్యటనపై నేడు టీడీపీ సమావేశం

- హాజరు కానున్న మంత్రులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈనెల 16న దేశప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఎమ్మిగనూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ పర్యటనపై కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు, బీజేపీ, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు, ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ప్రధాని పర్యటనను జయప్రదం చేసే విషయంపై చర్చించి ప్రణాళిక సిద్ధం చేస్తామని ఆయన తెలిపారు.

తేలనున్న కొలతలు

- క్షేత్రస్థాయిలో పకడ్బందీగా రీసర్వే
- గత ప్రభుత్వ హయాంలో తప్పుల తడక..
- ఆనందంలో రైతన్నలు

నంద్యాల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల డివిజన్ పరిధిలో 217 రెవెన్యూ గ్రామాలుండగా 111 గ్రామాల్లోని 2,89,551.48 ఎకరాల్లో వైసీపీ ప్రభుత్వం రీసర్వే తప్పుల తడకగా చేపట్టింది. ఇది రైతుల పాలిట శాపంగా మారింది. భూయజమానులకు సమాచారమివ్వకుండా దస్తావేజులు పరిశీలించకుండానే సర్వేచేసి సెంటు నుంచి 30సెంట్ల వరకు భూముల కొలతల్లో తేడాలు చేసి తగ్గించారు. తహసీల్దారు, గ్రామ రెవెన్యూ సదస్సుల్లో తేడాలపై ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. రైతుల బాధను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఎలాగైనా న్యాయం చేయాలనుకుంది. దీనిపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పలు బృందాలను నియమించి రీసర్వేను చేపట్టింది.

రైతుల సమక్షంలోనే..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంబంధిత రైతులకు సమాచారమిచ్చి వారి సమక్షంలోనే సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించి కచ్చితమైన సర్వేను చేపట్టి రైతులకు న్యాయం చేస్తుంది. ఒకటే సర్వే నంబర్లో ఐదుగురు రైతులుంటే వారికి ఒక్కొక్కరికి ఒక ఎల్‌పీఎమ్ నంబరు కేటాయిస్తుంది. ఒక్కటే సర్వే నంబర్లో ఇద్దరు రైతులుండి కొలతల్లో తేడా ఉంటే ఇద్దరికి సమానంగా కొలతలు వేసి జాయింట్ ఎల్‌పీఎమ్ నంబరు కేటాయిస్తోంది. గ్రామంలోని విస్తీర్ణాన్ని బట్టి పలు బ్లాక్‌లుగా గుర్తించి ఒక్కొక్క బ్లాక్‌కు ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వోను నియమించి విడతల వారీగా సర్వే చేస్తున్నారు. తొందరపాటుతో తప్పుడు సర్వే చేయకుండా ఒక్కో బృందానికి కేవలం 200 ఎకరాలు మాత్రమే కేటాయిస్తున్నారు. జనవరి 2025 నుంచి రీసర్వే కార్యక్రమం చేపట్టింది. మొదటి, రెండో విడత పూర్తి చేసింది. మూడో విడత శుక్రవారం నుంచి ప్రారంభించింది.

పారదర్శంగా సర్వే చేస్తున్నాం..

గతంలో చేపట్టిన సర్వేలాగా కాకుండా రైతుల సమక్షంలో, డాక్యుమెంట్లు, పొలం సరిహద్దురాళ్లు గుర్తించి పారదర్శకంగా సర్వే చేస్తున్నాం. మూడో విడతలో 19 గ్రామాల్లో సర్వే చేయనున్నాం. నివేదికను డిసెంబరు లోపు ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. మిగిలిన గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిచేస్తాం.
-చల్లా విశ్వనాథ్, ఆర్డీవో, నంద్యాల



రుద్రవరం మండలం ఎల్లావత్తులలో ప్రారంభిస్తున్న మూడో విడత సర్వే





గోస్పాడు మండలం దీబగుంట్లలో రైతుల సమక్షంలో సర్వే చేస్తున్న అధికారులు

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

- ఎస్పీ సునీల్ షెరాన్
- జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్
- 16 బైక్‌లు, రెండు లారీలు స్వాధీనం
- 30 లీటర్ల నాటుసారా, 20 మద్యం సీసాలు సీజ్

నంద్యాల టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు గ్రామాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. సరిష్మైన పత్రాలు లేని 16 బైక్‌లు, గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 30 లీటర్ల నాటు సారా, 20 మద్యం బాటిళ్లను గుర్తించి సీజ్ చేసినట్లు వివరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా నేరం జరగుతున్నట్లు తెలిస్తే స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



లారీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఆత్మకూరులో తనిఖీ చేస్తున్న పోలీసులు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించామని ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజంలో మంచి పౌరులుగా జీవించాలన్నారు. రౌడీ షీట్ ఉన్నవారిపై నిత్యం నిఘా ఉంటుందన్నారు. నేర చరిత్రను వదిలి మంచిగా బతుకాలన్నారు. కార్యక్రమం లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ మల్లికార్జునతోపాటు పోలీసులు గ్రామంలోని అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. బెల్ట్ దుకాణాలపై దా డులు చేశారు. సరస్వతమ్మ అనే మహిళ వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని లక్ష్మీనగర్‌లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలువురి అనుమానితులు, నేరచరిత్ర కలిగిన వారి నివాసాల్లో తనిఖీలు చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు.

రైతు సమాఖ్య కృషి ప్రశంసనీయం

- నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి
- ఘనంగా నంది రైతు సమాఖ్య రజతోత్సవ వార్షికోత్సవం

నంద్యాల కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులకు సంపూర్ణ భావంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం ప్రశంసనీయమని నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో నంది రైతు సమాఖ్య రజతోత్సవ వార్షికోత్సవం సమాఖ్య సలహాదారు డాక్టర్ రవీంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నంది రైతు సమాఖ్య 25 సంవత్సరాల ప్రత్యేక వార్షిక సంచికను ముఖ్య అతిథులు మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రైతులు, రైతు నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో ప్రధాన వక్త డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు, రైతు నాయకులు రామసుబ్బారెడ్డి, రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ ఓబులపతి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడిగా బీవీ రామసుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు పాల్గొన్నారు.



వార్షిక సంచికను ఆవిష్కరిస్తున్న సమాఖ్య నాయకులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 11న నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథక వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు కోరారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రవణమ్మ, వెంకటరమణ, సంజన్న, సంధ్య, సులోచనమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ఆత్మకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న ఫ్యాప్టో రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శంకర్, సహా అధ్యక్షుడు ఉమర్ కోరారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయా డిమాండ్ల సాధన కోసం చేపట్టనున్న ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

జీఎస్టీపై అవగాహన

మహానంది, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బీపురం గ్రామంలో ఆదివారం జీఎస్టీ పై కూటమి నాయకులు ర్యాలీ నిర్వహిం చారు. ముఖ్య అతిథి కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ వలన కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యశస్విని, నాయకులు నరాల చంద్రమౌళీరరెడ్డి, దస్తగిరి, హరిప్రసాదరెడ్డి, మధు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పాణ్యం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985- 86 పదవతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాదు, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి 40మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో చదివి ఉన్నతస్థాయికి ఎదిగిన తాడిపత్రి డీపీవో నాగరాజనాయుడు, అన్నమయ్య జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ బలరామిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గోపాల్ హాజరయ్యారు. విద్యార్థులు తమ గురువులు వెంకటరెడ్డి, ఓబులరెడ్డి, సుబ్బారెడ్డి, అంకన్న, నాగలక్ష్మయ్యలను సత్కరించారు.

ఉపాధ్యాయుడు కొప్పుల ప్రసాద్‌కు 'గురుతేజం' పురస్కారం

నంద్యాల కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, రచయిత కొప్పుల ప్రసాద్‌కు 'గురుతేజం' పురస్కారం వరించింది. జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించిన పలువురు ఉపాధ్యాయులకు ఆదివారం చిత్తూరులోని రెవెన్యూభవన్‌లో పురస్కారాలు అందజేశారు. నంద్యాలకు చెందిన ప్రసాద్‌కు ఉషోదయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ ధనాశి ఉషారాణి, తెలుగుకళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రత్నం పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డుగ్రహీతను నంద్యాలకు చెందిన రచయితలు, ఉపాధ్యాయులు, కవులు అన్నెం శ్రీనివాస రెడ్డి, నరేంద్ర, డాక్టర్ రవిక్రిష్ణ, శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ తదితరలు అభినందించారు.

నేడు క్యాన్సర్ నివారణ టీకాలు

జూపాడుబంగ్లా, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని తరిగోపుల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు సోమవారం క్యాన్సర్ నివారణ టీకాలు వేయనున్నట్లు కర్నూలు ఓమెగా హాస్పటల్ ప్రముఖ వైద్యుడు రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల కిందట విద్యార్థులకు ఉచి తంగా టీకాలు వేశామని, రెండో విడత డోసును సోమవారం వేయ నున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు రావాలని ఆయన కోరారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

వెలుగోడు, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటు పడుదామని వెలుగోడు సర్పంచ్ జయపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని పాత, కొత్త బస్టాండు ప్రాంతాలలో టీఐ ప్రోగ్రాం మేనేజర్ జుల్‌ఫికర్, సీఎస్‌ఐ చర్చి పాస్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వరమ్మ, రాణెమ్మ, నాగేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

ఆత్మకూరురూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. ఆదివారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 గంటల పని విధానం రద్దు కోసం కార్మికులు ఐక్య పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన జీవో ప్రకారం ప్రతి కార్మికుడికి కనీస వేతనం ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, నాయకులు ఇస్మాయిల్, పసురేటుంద్ర, నాగేశ్వరరావు, సుబ్బయ్య, బాషా, మంజుల, విజయలక్ష్మి, ప్రభావతి, శంషాద్‌బి, మేరమ్మ పాల్గొన్నారు.

ప్రచారాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేన గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రచార వాహనాన్ని ఆదివారం గ్రామస్థులు అడ్డుకున్నారు. తమ గ్రామంలో ప్రచారం నిర్వహించడానికి వీలు లేదని, త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను స్వాధీనం చేసుకొని ప్రచార బృందాన్ని వెనక్కు పంపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత భగవద్గీత పేరుతో నకిలీ పుస్తకాలను పంపిణీ చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బ తీస్తున్నారని ఆరోపించారు.



పల్లకీలో దర్శనమిచ్చిన ఉత్సవమూర్తులు

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, అక్టోబరు 5,(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం శ్రీశైలం దేవస్థానంలో ఆదివారం రాత్రి శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. అలాగే మహాగణపతి పూజ చేశారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి పల్లకీలో ఊరేగించారు. భక్తులు ఉత్సవమూర్తులను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైల దేవస్థానం దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఆదివారం సాయంకాలం నాట్యపురి డ్యాన్స్ అకాడమి హైదరాబాద్ వారు సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. నృత్య కళాకారులు సమితా మిశ్ర, జ్యోతిక, ఐశ్వర్య తదితరులు మహాగణపతిం, శివపంచాక్షరి, దేవిస్తుతి, శివతాండవ స్తోత్రం తదితర గీతాలకు, స్తోత్రాలకు నృత్యాన్ని ప్రదర్శించారు. భక్తులు మంత్రముగ్ధులైయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వెండి పుష్పమాల వితరణ

పాణ్యం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొత్తూ రు సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామికి భక్తులు ఆది వారం వెండి పు ష్ప మాలను వి తరణ చేశారు. ఈవో రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చిమట పోతురాజు జ్ఞాపకార్థం కుమారుడు రామకృష్ణ, కోడలు లక్ష్మీ స్వామివారికి 260 గ్రాముల వెండి పుష్పమాలను అందజేశారన్నారు. అంతకుముందు భక్తులు ప్రత్యేక పూజలు చేయగా తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సు బ్బారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నంద్యాల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోపాల్‌నగర్‌లో నిర్మిస్తున్న శ్రీవరసిద్ధి వినాయక అభయాంజనేయ స్వామి దేవాలయ పునఃనిర్మాణానికి 38వ వార్డు వైఎస్సార్‌నగర్ టీడీపీ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు విరాళం అందజేశారు. ఆదివారం ఆయన నివాసంలో నగదును నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో 15వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి గోసుల నాగేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాసరావు, కరీం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుద ల చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశం లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, నాయక్ పాల్గొన్నారు.

బుక్కాపురంలో క్షుద్రపూజల కలకలం



క్షుద్ర పూజలు నిర్వహించిన స్థలం

మహానంది, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురంలో ఆదివారం క్షుద్రపూజలు జరగడంతో కలకలం రేగింది. గ్రామ శివారు ప్రాంతంలోని శ్మశాన స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పూజలు నిర్వహిస్తుండగా గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. దాంతో గమనించిన సదరు వ్యక్తులు బైక్‌లపై పరారయ్యారు. శ్మశానంలో చేసిన పూజలను చూసి గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

తుగ్గలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మానసిక అనారోగ్యంతో బాధ పడుతూ జీవితంపై విరక్తితో జశ్వంత్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు ఉప్పర్లపల్లికి చెందిన చంద్రశేఖర్, దివ్య దంపతుల కుమారుడు జశ్వంత్ గత పదేళ్లుగా అనారోగ్యంతో బాధతో వైద్యులతో చికిత్స పొందుతూ జీవితంపై విరక్తి పుట్టి పొలానికి వెళ్లి వాజ్‌మోల్ తాగి వాంతులు చేసుకుంటుండగా.. గమనించిన బంధువులు గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత గొడవలతో వ్యక్తిపై దాడి

నంద్యాల టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పాత గొడవలతో వ్యక్తిపై దాడి జరిగింది. ఈ ఘటన నంద్యాల పట్టణం గాంధీనగర్ ప్రాంతంలో ఆదివారం చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వినాయక చవితి ఉత్సవాల్లో ఘాట్బాల్ నగర్‌కు చెందిన సుభాన్, పరుశురాముడు గొడవ పడ్డారు. అలాగే, సుభాన్ ప్రతిరోజూ హేళన చేసేవాడు. దాంతో విసిగిపోయిన పరుశురాముడు ఆదివారం ఉదయం గాంధీనగర్ జంక్షన్ వద్ద సుభాన్‌పై గొడ్డలితో వెనుక నుంచి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన క్షతగ్రాతుడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిందితుడు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయ్యాడు. పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

అహోబిల నారసింహుడికి శేర్తి పూజ



ప్రత్యేక పూజల్లో నరసింహ స్వామి

ఆళ్లగడ్డ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ఆదివారం అహోబిల 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ వారి ఆధ్వర్యంలో శేర్తిపూజ నిర్వహించారు. మాలోల నరసింహస్వామి ఉత్సవ మూర్తిని మూల మూర్తితో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా సుప్రభాతంతో స్వామి వారిని మెల్కోలిపి గద్యత్రయం విన్నవించారు. పీఠాధిపతి భవనాసి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జల క్రీడలు



ప్రథమస్థానం పొందిన ఎన్టీఆర్ జిల్లా జట్టు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని గార్గేయపురం చెరువులో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి జల క్రీడలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులుగా నిర్వహించిన నాల్గవ రాష్ట్ర స్థాయి కేనోయింగ్, కయాకింగ్, డ్రాగన్ బోట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర, రాష్ట్ర కేనోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బలరాం నాయుడు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్పోర్ట్స్ కోటాను మూడు శాతానికి పెంచి అమలు చేసిందన్నారు. క్రీడల నిర్వహణకు రాష్ట్ర స్థాయిలో కర్నూలుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు మంచికంటి అవినాష్, శివారెడ్డి, రుద్ర రెడ్డి, సునీల్ కుమార్, నాగరత్నమయ్య పాల్గొన్నారు.



దేశ సమైక్యతే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

ఉమ్మడి కర్నూలు జిల్లా విభాగ్ ప్రచారక్ సురేంద్ర



ప్రార్థన చేస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

ఆత్మకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భారతదేశ సమైక్యతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆర్ఎస్ఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా విభాగ్ ప్రచారక్ సురేంద్ర పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ వందేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో విజయ దశమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారక్ సురేంద్ర మాట్లాడుతూ వేల ఏళ్ల చరిత్ర కలిగిన భారతదేశం ప్రపంచానికే జ్ఞానాన్ని, సంస్కృతిని అందించిందన్నారు. స్వతంత్రం కోసం ఒకరిని ఎదుర్కొంటే మరొకరొచ్చి దేశ ప్రజలను బానిసలుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు హిందువుల్లో ఐక్యత లేకపోవడమే ప్రధాన కారణమని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే డాక్టర్ హెడ్గేవార్ గొప్ప ఆలోచనతో స్వాతంత్ర్య పొందిన భారతదేశాన్ని ఏవిధంగా కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే 1925 విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్‌ను స్థాపించినట్లు తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా గుర్తింపు దక్కించుకుందన్నారు. దేశభక్తి, సామాజిక సమగ్రతను ప్రపంచానికి వివరిస్తూ విపత్తుల నుంచి ప్రజల్ని రక్షించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో ఆర్ఎస్ఎస్ నిస్వార్థంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వాసుదేవరెడ్డి, బాణాల లక్ష్మీనారాయణ, మారం భానుమూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పోస్టుల పరీక్షలను ఆదివారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని, 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల కోసం ఇటీవల బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అభ్యర్థులకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు జిల్లాలో పరీక్ష కేంద్రాలను కేటాయించారని తెలిపారు. పుల్లయ్య కాలేజీలోని పరీక్షకు 261 మంది అభ్యర్థులు హాజరయ్యారని, రెండు విడతల్లో పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే పేపర్-2లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించామని ఎస్పీ అన్నారు. ఏఎస్పీ హుశేన్‌పీరా, తాలుకా సీఐ తేజమూర్తి ఉన్నారు.

పేట్నికోటలో వాహనం బోల్తా



బోల్తా పడిన వాహనం

కొలిమిగుండ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్కార్పియో వాహనం అదుపు తప్పి సినిమాలో తలపించేలా మూడు పల్టీలు కొట్టింది. ఈఘటన మండలంలోని పేట్నికోట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. అయితే అదృష్టవశాత్తు అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు స్వల్పగాయాలతో బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కోటపాడు గ్రామానికి చెందిన రామసుబ్బయ్య స్కార్పియో వాహనం పేట్నికోట నుంచి కొలిమిగుండ్లకు వస్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే బాదు గుట్టల్లో పల్టీలు కొట్టింది. గాయపడిని వారిని చికిత్స నిమిత్తం చుట్టు పక్కల వారు ఆసుపత్రికి తరలించారు. వాహనం పూర్తిగా దెబ్బతింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

మంత్రాలయం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాల మేరకు.. మంత్రాలయం సమీపంలో బెంగళూరు నుంచి వస్తున్న కారు, మాధవరం నుంచి ఎమ్మిగనూరు మోటారు సైకిల్‌పై వెళ్తున్న బోయ దుల్లయ్యను ఢీకొట్టింది. దుల్లయ్యకు గాయాలయ్యాయి. అలాగే బూదూరు సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో బోయ గురుస్వామి, సూరయ్య, వీరేష్, వడ్డె కృష్ణమరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా మాధవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో మాధవరానికి గ్రామానికి చెందిన సర్పంచ్ ఇందిరమ్మ, ఆమె భర్త యాకోబు ఆదోనికి బైక్‌పై వెళ్తుండగా.. అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో దంపతులిద్దరికీ గాయాలు కావడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. మంత్రాలయం, మాధవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ బోల్తా ..

బనగానపల్లె అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామ సమీపంలో కైప గ్రామానికి వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 8 మందికి గాయాలైనట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం శిరువెళ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన చిలకల బోడెన్న కుమారుడు రమేష్ వారి కుటుంబ సభ్యులతో కలసి మొక్కుబడి నిమిత్తం కైప గ్రామంలోని తిమ్మయ్య స్వామి గుడికి వెళ్లి తిరిగి కోటపాడు గ్రామానికి వస్తుండగా టంగుటూరు పెద్దమ్మ గుడి సమీపంలో ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. రమేష్‌తోపాటు ఆయన బంధువు రమేశ్, లక్ష్మీదేవి, మాధురి, లింగమ్మ, తిమ్మయ్య, కావ్యమ్మ, అబ్దుల్ రహీం, దస్తగిరి తదితరులు గాయపడ్డారు, గాయపడ్డ వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. వివరాల మేరకు.. కబడ్డీ ఆటలో వివాదం చోటుకుచేసుకుని కిరణ్ అనే వ్యక్తిపై బోయ భార్గవ్, మరి కొందరు దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని తాలూకా పోలీసులు తెలిపారు.

మూడు లారీలు ఢీ..

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని టీవీ9 కాలనీ వద్ద జాతీయ రహదారిపై మూడు లారీలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.. నంద్యాల నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న ఐచర్ లారీని వెనుక వస్తున్న మరో ఐచర్ లారీ ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన వాహనం ముందే వెళుతున్న లారీని ఢీకొట్టింది. మధ్యలో ఉన్న ఐచర్ వాహన డ్రైవర్ మల్లేష్‌కు గాయాలుకాగా, మరో వ్యక్తి మహేంద్ర కాలు ఫ్రాక్చర్ అయింది. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నర్ల విముఖత

3వ పేజీ తరువాయి

ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర రూ.8110 ప్రకటించింది. క్వింటాలు గరిష్ఠంగా పత్తిని రూ.7300 మించి కొనుగోలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే క్వింటాలు రూ.900పైగా తక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మద్దతు ధర కంటే తక్కువగా పత్తి ధర పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన ఎరువులు విత్తనాల ధరలు కూలీ ఖర్చులతో మార్కెట్లో పలుకుతున్న ధర తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులకు కనీస మద్దతు ధరతో ఆదుకోవాల్సిన సీసీఐ, జిన్నింగ్ పరిశ్రమలకు విధించిన కొర్రీతో మరింత కొనుగోలు ఆలస్యం జరిగే అవకాశం ఉంది.

120కి పైగా పరిశ్రమలు

ఉమ్మడి జిల్లాలో 120కి పైగా జిన్నింగ్ పరిశ్రమలున్నాయి. ప్రతి ఏటా సీసీఐకి 20కి పైగా జిన్నింగ్ పరిశ్రమలు అద్దెకు ఇస్తారు. గతఏడాది ఆదోనిలో 10, ఎమ్మిగనూరులో నాలుగు, నంద్యాలలో 3, మంత్రాలయంలో 1, కర్నూలు సమీపంలోని పెంచికలపాడులో 1 జిన్నింగ్ పరిశ్రమ సీసీఐ అద్దెకు నడిపింది. ఆదోని కేంద్రంలోని 5 పత్తి జిన్నింగ్ పరిశ్రమల నుంచి 2024లో కనీస మద్దతు ధరతో సీసీఐ 1,70,673 క్వింటాళ్ల రైతుల నుంచి కొనుగోలు చేసింది. మిగతా కేంద్రాల నుంచి మరో లక్ష క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ పంట చేతికి వచ్చే సమయానికి పత్తి ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా పలుకుతుంది. సీసీఐ విధించిన నిబంధనలు సడలిస్తే తప్ప తాము జిన్నింగ్ పరిశ్రమలు అద్దెకు ఇవ్వలేమని చెబుతున్నారు.

సీసీఐ నిబంధనలు ఇవే..

ఒక బ్రాంచిలో రెండు, మూడు జోన్లుగా చేసి లింట్ పర్సంటేజ్‌లో మార్పులు చేయడంతో పాటు గతంలో కంటే ఎక్కువగా పెంచారు. వంద కిలోల పత్తిలో ఏ నెల ఎంత దూది ఇవ్వాలనే నిబంధన పెట్టారు. గతంలో ఇది నెలవారీగా ఉండేది. ఈ సీజన్‌లో రెండుసార్లు ఇవ్వాలని సూచించారు. 100 కేజీల పత్తికి దూది 97.5 కేజీలు ఇవ్వాలంటుంది. బేలు తయారు చేసే సమయంలో గతంలో లోటు (షార్టేజ్) 3.15 నుంచి 1.90 శాతం ఉండేది. దాన్ని 1.25 నుంచి 0.75 శాతానికి తగ్గించారు. చెత్త 2.5 శాతం విధించింది.

- ప్రతి జిన్నింగ్ పరిశ్రమలో అధునాతన సౌకర్యాలతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు ఆరు నెలలపాటు డేటా ఏఐ అనాలసిస్ భద్రంగా స్టోరేజ్ కలిగి ఉండాలి.

ఎల్ వన్, ఎల్ టూ, ఎల్‌త్రీ విభజన చేయడంపై ఈ నిబంధనలు బేళ్ల ధర జిన్నింగ్‌లో సౌకర్యాలు తదితర వాటిపై చర్చలు జరిపిన తర్వాతనే టెండర్లకు వెళ్తామని కాటన్ అసోసియేషన్ అంటోంది.

నిబంధనలు సడలిస్తేనే..



సీసీఐ విధించిన కొత్త నిబంధనలు సడలిస్తే తప్ప తాము టెండర్లలో పాల్గొనలేం. ప్రతి జిన్నింగ్ పరిశ్రమలో పదివేల బేళ్ల దూది ఉత్పత్తి చేస్తామని హామీ ఇస్తే అధునాతన సౌకర్యాలు కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదు.

● వెంటకటరామి రెడ్డి, కాటన్ మర్చంట్, ఆదోని

మంకు పట్టు వీడాలి



సీసీఐ మంకు పట్టు వీడి రైతులకు మేలు చేకూర్చేలా కనీస మద్దతు ధరతో కొనుగోలుకు ముందుకు రావాలి. వారు విధించిన కొత్త నిబంధనలు తమకు నష్టం చేకూర్చేలా ఉన్నాయి, నిబంధనలు సడలిస్తే తప్ప తాము జిన్నింగ్ పరిశ్రమలను అద్దెకు ఇవ్వలేం.

- బత్తిని కుబేర నాథ్, ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ పరిశ్రమ యజమాని, ఆదోని



దేవరగట్టులో కర్రలతో తలలు పగిలేలా చేసుకునే ఉత్సవమే కాదు... పరిసర ప్రాంతాలు సైతం ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఈ ప్రాంతంలో మనసు పెట్టి చూస్తే ప్రతీది ప్రకృతి సౌందర్యమే. కనుచూపు మేర కనిపించే కొండల్లో అద్భుతమైన చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' గుర్తించింది. హొళగుంద మండలం దేవరగట్టుకు వెళ్లే మార్గంలో కొండలపై ఓ బండరాయిని దూరం నుంచి చూస్తే లేపాక్షి నందిని పోలినట్లు కనిపించింది. 'లేపాక్షి బసవయ్య లేచి రావయ్య.. కైలాస శిఖరిలా కదలిరావయ్యా..' అంటూ ప్రఖ్యాత తెలుగు రచయిత, చిత్రకారుడు అడవి బాపిరాజు ఓ సారి లేపాక్షికి వెళ్లినప్పుడు చెప్పిన మాటలు ఈ దేవరగట్టు నందికి కూడా సరిపోయేలా ఉన్నాయి.

- హొళగుంద

ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

పొగాకు పంట ధ్వంసం.. కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గార్గేయపురం గ్రామంలో సాగుచేసిన పొగాకు పంటను ధ్వంసం చేసినవారిపై తాలూకా పోలీసులు కేసు నమోదు నమోదు చేశారు. వివరాల మేరకు.. గ్రామంలోని వక్ఫ్‌బోర్డు భూముల్లో మహ్మద్ రఫీ మరికొంతమంది ముత్తావర్లు పొగాకు పంటను సాగు చేసుకుంటున్నారు. కాగా షమీవుల్లా, కిరణ్ అనే వ్యక్తులు మరికొంత మందితో కలిసి ట్రాక్టరుతో పంటను ధ్వంసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్ప్రవర్తన ఉంటే సాయం చేస్తాం : సీఐ

రౌడీ షీటర్లకు పోలీసుల వినూత్న కౌన్సెలింగ్



నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తన అలవరచుకుంటే అన్ని విధాలా సాయం చేస్తామని నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ అన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లు, నేరచరిత్రగల వారిని పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ పిల్లల చదువుల విషయంలో విద్యాసంస్థల యాజమాన్యంతో మాట్లాడి ఫీజులు తగ్గించేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అనారోగ్య, వ్యక్తిగత సమస్యలు ఉంటే పరిష్కార మార్గాలు చూపిస్తామన్నారు. పది సంవత్సరాల పాటు కేసు నమోదు కానివారిపై రౌడీషీట్లు తొలగించడానికి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. మారిన వారికి పోలీసు అధికారుల సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలిపారు.

ఆస్తి వివాదం.. నలుగురిపై దాడి



దాడిలో గాయపడిన లక్ష్మి, మహాలక్ష్మి

బేతంచెర్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామంలో ఆస్తి విషయంలో ఆదివారం ఘర్షణ జరిగింది. లక్ష్మి, మహాలక్ష్మి, సుజాత మాధవ లక్ష్మిలపై శేఖర్, భార్య శ్యామల, తమ్ముడు మధు కత్తితో దాడి చేశారు. శేఖర్, తమ్ముడు మధు గత కొంత కాలం నుంచి తల్లి సుభద్రమ్మతో ఆస్తి విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ విషయంపై సుభద్రమ్మ కుమార్తెలు ఆర్.కొత్తపల్లి గ్రామానికి వచ్చి సమస్య పరిష్కారం కోసం చర్చిస్తుండగా.. మధు మహిళలపై కత్తితో దాడి చేశారు. గాయపడిన వారిని బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెండి గిన్నెల వితరణ


చెన్నకేశవ ఆలయంలో వెండి గిన్నెలు అందజేస్తున్న దాత రమణారావు

చాగలమర్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయులు రమణారావు, పార్వతిదేవి దంపతులు రూ.26 వేలు విలువ చేసే కుంకుమ, తీర్థం వేసే వెండి గిన్నెలను ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. కమిటీ సభ్యులు, దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సురేష్, దస్తగిరి, చిన్నికృష్ణయ్య, రమణ, ప్రసాదు, ప్రధాన అర్చకుడు శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

వైభవంగా పొన్నుసేవ అలంకారం


చాగలమర్రిలో పొన్నుసేవ అలంకారంలో కొలువుదీరిన అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు, చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి, చెన్నకేశవ ఆలయాల్లో ఆదివారం వేద పండితులు, మహిళల ఆధ్వర్యంలో పొన్నుసేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు పొన్నుసేవ అలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల పూలతో అలంకరింప చేసిన ఉయ్యాల తొట్టిలో అమ్మవారిని కొలువుదీర్చి గీతాలు ఆలపిస్తూ పొన్నుసేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి

డోన్ టౌన్/డోన్‌రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో మంగళవారం జరిగే వాల్మీకి మహర్షి జయంతిని విజయవంతం చేయాలని వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, డోన్ వాల్మీకి సంఘం నేతలు డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీలం భాస్కర్ నాయుడు, పోస్టు ప్రసాద్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మాట్లాడుతూ పట్టణంలోని జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి వాల్మీకులందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అడ్వకేట్ కృష్ణమూర్తి, శ్రీరాములు, పాల్ రాజు, ధర్మారం నాయుడు, కొండపేట మహేంద్ర నాయుడు, డీలర్ కృష్ణ, ఉడుములపాడు నాగేంద్ర, అడ్వకేట్ శివ రామ కృష్ణ, పూల శ్రీను, ఆర్మీ రామయ్య కేశవయ్య పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్లలో 7న జరిగే రామాయణ గ్రంథాకర్త వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జయప్రదం చేయాలని వీఆర్‌పీఎస్ కన్వీనర్ టైలర్ రాముడు వాల్మీకి సోదరులకు సూచించారు. ఆదివారం రాత్రి పట్టణ శివారులోని నంద్యాల రహదారిలోని పలక చింతామణి ఆంజనేయస్వామి కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, పుట్టపాశం వెంకటేశ్వర్లు, రమణ, చల్లా మద్దిలేటి, డిష్ నాయుడు కిరణ్ వాల్మీకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన


కొలిమిగుండ్ల ప్రభుత్వ ఆసుపత్రి

కొలిమిగుండ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు నిరసనకు దిగడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత పది రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు పలురకాలుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో అత్యవసరం వైద్యం తప్ప రోగులకు సక్రమంగా వైద్య సేవలందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సేవలందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని వైద్యులు కోరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో వైద్యుల యూనియన్ నుంచి ఆదేశాలు వచ్చేవరకూ నిరసనలు కొనసాగుతాయని కొలిమిగుండ్ల మండల పీహెచ్‌సీ వైద్యులు డా.హరిచరణ్‌రెడ్డి, డా.జ్యోతి, డా.నాగార్జున తదితరులు తెలిపారు.

ఎమ్మెల్యే కోట్లను కలిసి మల్లికార్జున



డోన్ టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బెస్త అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల మల్లికార్జున డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బెస్తల సంక్షేమానికి, అభివృద్ధి కోసం పని చేయడానికి డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బీసీలు, బెస్తల అభివృద్ధి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోట్ల ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

వాహనాల తనిఖీ - కేసు నమోదు

కోవెలకుంట్ల అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలోని బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం డిగ్రీ కళాశాల సమీపంలో వాహనాలు తనిఖీ చేసి రికార్డులు, లేని వాహనాలకు జరిమానా విధించి కేసులు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసన్సులు కలిగి ఉండాలని సూచించారు. వాహనాలను తగినంత వేగంతో నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.

దస్తగిరిస్వామి జెండాతో గ్రామోత్సవం


చాగలమర్రిలో దస్తగిరిస్వామి జెండాతో ఊరేగింపు

చాగలమర్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో దస్తగిరిస్వామి గ్యార్మి పండుగ సందర్భంగా ఆదివారం దస్తగిరిస్వామి దర్గా కమిటీ సభ్యులు స్వామి జెండాను పురవీధుల గుండా గ్రామోత్సవం చేశారు. మేళతాళాలతో జెండాను పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో స్వామి జెండాలకు ఫాతెహాలు చేసి ప్రార్థనలు నిర్వహించారు.

ఆసరాతో ఆనందం


చాగలమర్రిలో హర్షం ప్రకటిస్తున్న టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు

'ఆటో డ్రైవర్ల సేవ' పథకం అమలుతో ప్రయోజనం

చాగలమర్రి/డోన్‌టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): 'ఆటో డ్రైవర్ల సేవ' లో పథకం అట్టహాసంగా ప్రారంభించడంతో టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు హర్షం ప్రకటించారు. జిల్లాలో ఈ పథకం కింద 10 వేల మంది ఆటో డ్రైవర్లు లబ్ధి పొందారు. రూ.15.09 కోట్లు నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. నంద్యాలలో 2,217, ఆళ్లగడ్డ 1,170, శ్రీశైలం 1,654, పాణ్యం 611, నందికొట్కూరు 1,697, డోన్ 1,363 మంది ఆటోవాలాలు ఉన్నారు. కూటమి ప్రభుత్వం తమకు ఆర్థిక భరోసా ఇచ్చిందని పలువురు డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేశారు. వారి సంతోషం వారి మాటల్లోనే..

మా కుటుంబాల్లో వెలుగులు



ఆటో డ్రైవర్ల సేవలో పథకం చాలా బాగుంది. ఎంతో మంది ఆటో వాలాల జీవనోపాధికి ఇది మేలు చేస్తుంది. ఎన్నికలకు ముందు ఎటువంటి హామీ ఇవ్వకపోయిన మా ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకున్నారు. 20 ఏళ్ల నుంచి ఆటో నడుపుతున్నా. కుమారుడు బీటెక్ చదువుతున్నాడు. కుమార్తె డిగ్రీ చదువుతోంది. ఈ పథకం ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో వెలుగులు నింపుతాయి.

- యోసేబు, ఆటో డ్రైవర్, మద్దూరు గ్రామం

ఆర్థిక భరోసా లభించింది



నేను 19 ఏళ్లుగా ఆటో నడుపుతున్నాను. చాగలమర్రిలో ఉంటూ జీవనం సాగిస్తున్నాను. భార్య, నలుగురు సంతానం ఉన్నారు. వచ్చిన ఆదాయంతోనే కుటుంబాన్ని పోషిస్తున్నాను. కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి.

- ఉసేన్‌బాషా, ఆటో డ్రైవర్, చాగలమర్రి

సంతోషంగా ఉంది



ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.15 వేల నగదును తమ ఖాతాలో నేరుగా జమ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్న సమయంలో టీడీపీ ప్రభుత్వం రూ.15వేలు ఇవ్వడంతో ఆటోలకి ఇన్సూరెన్స్, ఎఫ్‌సీ ధ్రువ పత్రాలు సరి చేసుకోవడానికి అలాగే వాహనం మరమ్మతులకు ఎంతో ఆసరాగా ఉంటుంది.

సి.శ్రీరాములు, ఆటో డ్రైవర్, డోన్

ఆటో డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యం


చాగలమర్రిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు

చాగలమర్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాష అన్నారు. ఆదివారం టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు కలిసి పాత బస్టాండు సమీపంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షం ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మౌళాలి, రాష్ట్ర డైరెక్టర్ అజిముద్దిన్, టీడీపీ నాయకులు మాబులాల్, జెట్టి నాగరాజు, జల్సాగౌస్, పట్టణ కార్యదర్శి అస్రఫ్, బాష, ఉసేన్, అబ్దుల్‌ఖాదర్, నాగూర్‌వలి, రజాక్ పాల్గొన్నారు.

సాయంతో ఎంతో ఆసరా



టీడీపీ ప్రభుత్వంలో మా కష్టాలు తీరుతున్నాయి. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్ల భవిష్యత్తు కోసం ఆలోచిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రుల పవన్‌కల్యాన్, నారా లోకేశ్‌లకు ప్రత్యేక అభినందనలు.

కే.మదుబాబు, డోన్

ఆనందంగా ఉంది



ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించి ఆర్థిక సాయం అందజేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. 20 ఏళ్లుగా ఆటోతో జీవనం సాగిస్తున్నా. కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కూడా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ సాయం ఎంతో ఆనందంగా ఉంది.

- ముల్లా గౌస్, ఆటో డ్రైవర్, చాగలమర్రి

ఆటోవాలాలకు ఎంతో మేలు



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల మాకు కొంత నష్టం కలిగింది. రూ.15 వేలుతో ఆ నష్టం భర్తీ అవుతుంది. ఆటో కార్మికులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇది ఎంతో ఉపయోగం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక భరోసాను ఎన్నటికీ మరువలేం.

- ఇమామ్‌హుసేన్, ఆటో వాలా, చాగలమర్రి

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇస్తే కూటమి ప్రభుత్వం మా ఖాతాల్లో రూ.15 వేలు జమ చేసింది. సీఎం మా కష్టాన్ని గుర్తించి రూ.15 వేలు కేటాయించడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, నారా లోకేష్‌కు కృతజ్ఞతలు.

మాబాషా, ఆటో డ్రైవర్, చాగలమర్రి


మంత్రి బీసీని, మాజీ ఎంపీపీ అంబాలను, కాట్రెడ్డిని సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు


హాజరైన కార్యకర్తలు, నాయకులు


వైసీపీకి భవిష్యత్‌లో పుట్టగతులుండవ్: మంత్రి బీసీ

బనగానపల్లె/కోవెలకుంట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించినా ఇంకా అబద్ధపు ప్రచారాలతో ప్రజలను నమ్మించడానికి వైసీపీ నేతలు యత్నిస్తున్నారని, వారికి భవిష్యత్‌లో పుట్టగతులుండవని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని మార్కెట్‌యార్డు కార్యాలయంలో బనగానపల్లె, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్‌గా కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, వైస్ చైర్మన్‌గా నడిపి భూషన్న, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా గెండెగాళ్ల మధులత, ఉపాధ్యక్షుడు నందిరెడ్డి విష్ణుశేఖర్‌రెడ్డి, ఇతర పాలకవర్గ డైరక్టర్లతో సెక్రటరీ గోరంట్ల శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలనలో బనగానపల్లె నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాలనలో ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. బనగానపల్లె మార్కెట్‌యార్డులో 2014నుంచి 2019 వరకు ఉపయోగపడే విధంగా గిడ్డంగులు నిర్మాణం ప్రారంభిస్తే వైసీపీ నాయకులు నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీ హయంలోనే అభివృద్ధి జరిగిందని, వైసీపీ పాలనో అభివృద్ధి శూన్యమన్నారు. బనగానపల్లె పట్టణంలో రూ.60లక్షలతో గిడ్డంగుల నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని షాదీఖానా నిర్మాణాన్ని అడ్డుకున్నారని, తిరిగి తాము సుందరంగా నిర్మించి ముస్లింలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి, డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.117 కోట్లతో అభివృద్ధి జరుగుతోందన్నారు. బనగానపల్లె ప్రజల స్వప్నం బైపాస్ రోడ్డు మొదలు పెట్టామన్నారు. పంచాయితీరాజ్ శాఖకు బనగానపల్లె నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.63కోట్లలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను చేపట్టామన్నారు. బనగనాపల్లె పట్టణంలో రూ.50 కోట్లతో పనులు చేపట్టామని, మరో 30 కోట్లతో పనులు పూర్తి చేస్తామన్నారు. జుర్రేరువాగు సుందరీకరణలో భాగంగా రూ.14 కోట్లతో వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభించి ఇప్పటికే రూ. 6.70 కోట్లతో పనులు పూర్తిచేశామన్నారు. హాస్టళ్ల అభివృద్ధికి రూ.3.50 కోట్లతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. అవుకు ఆస్పత్రికి రూ.25లక్షల సొంత నిధులు పరికరాల కోసం ఇచ్చామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, పీవీ. కుమార్‌రెడ్డి, చల్లా భాస్కర్‌రెడ్డి, సంగు శ్రీనివాసరెడ్డి, గుండం మల్లిఖార్జునరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, ఉగ్రసేనారెడ్డి, బురానుద్దీన్, కోవెలకుంట్ల సొసైటీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, ఎస్‌ఏ గఫూర్, కాశీంభాష, వెంకటరమణనాయక్, నంద్యాల రామేశ్వరరెడ్డి, మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నాగేశ్వరరెడ్డి,

వైసీపీ పాలనలో అభివృద్ధికి అడ్డంకులు

బనగానపల్లె/కోవెలకుంట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో బనగానపల్లె నియోజకవర్గంలో అడుగడుగునా అభివృద్ధి పనులు అడ్డుకొని అభివృద్ధిని నిర్వీర్యం చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిదే అ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. బనగానపల్లె పట్టణంలోని మార్కెట్‌యార్డులో బనగానపల్లె, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ వైస్ చైర్మన్ పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం మంత్రి బీసీ మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కాటసాని రామిరెడ్డి అవినీతిపై తీవ్ర విమర్శలు చేశారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి రోగులకు ఉచితంగా భోజనాలు పెట్టిస్తుంటే ఓర్వలేక ఆపివేసిన ఘనత కాటసానిదే అన్నారు. గత ఎన్నికల సమయంలో ఓటమి భయంతో కూరగాయల మార్కెట్‌లో తన సతీమణి బీసీ ఇందిరమ్మపై దాడులు చేసి దుష్ట సంస్కృతి మీకే దక్కిందని విమర్శించారు. మీరా ఇప్పుడు నీతులు చెప్పేదంటూ విమర్శించారు. నకిలీ పట్టాలు ఇచ్చి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ వారిని మోసం చేసింది మీరు కాదా అని కాటసానిని ప్రశ్నించారు. బనగనాపల్లెలో నకిలీ పట్టాలు రెండు సార్లు ఇచ్చి పేదలను మోసం చేశారన్నారు. కార్పెంటర్ కాలనీ వారికి చట్టపరంగా త్వరలో న్యాయం చేస్తామన్నారు. పట్టణంలోని పేదలకు త్వరలో పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా కూటమి ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం మండలంలోని బాచేపల్లె గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.2.85 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ బాచేపల్లె నుంచి అహోబిలం వరకు ఎనిమిది కిలో మీటర్ల మేర రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి తిరుణాల ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. ముస్లింలకు షాదీఖానాలను నిర్మిస్తామని అన్నారు. ఇంటి స్థలాలు లేని వారికి ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇప్పించి, ఇంటిని నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, డిఈ మల్లికార్జున, ఏఈ జయన్న, ఎంపీడీవో నూర్‌జహాన్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సంజామల, అక్టోబరు 5,(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షనిస్టులు , రౌడీషీటర్లు సత్‌ప్రవర్తన అలవర్చుకోవాలని కోవెలకుట్ల సీఐ హనుమంత నాయక్ కోరారు. ఆదివారం ఫ్యాక్షన్ గ్రామమైన కానాలలో ఎస్ఐ రమణయ్య, మల్లికార్జున రెడ్డి సిబ్బందితో కలిసి గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. నేర చరిత్ర కలిగిన వారి ఇండ్లలో సోదాలు చేసి, కౌన్సెలింగ్ ఇచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబరు అడిగితే ఇవ్వరాదన్నారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

బేతంచెర్ల: నేరాలకు దూరంగా ఉండి ఘర్షణలకు పాల్పడకుండా దూరంగా ఉండాలని రౌడీషీటర్లను సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో ఆయా గ్రామాల రౌడీషీటర్లకు సీఐ వెంకటేశ్వరరావు కౌన్సిలింగ్ చేశారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే శాఖాపరమైనచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా జీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతియుత వాతావరణంలో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

బనగానపల్లె అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2003-04 సంవత్సరాలకు చెందిన పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పట్లో విద్యార్థులకు పాఠాలు చెప్పిన గురువులు రంగారెడ్డి, దాదాభాష, సురేశ్‌బాబు, పద్మావతి, వెంకటలక్ష్మి, సుబ్బరాయుడు, నారాయణ, రమేశ్‌లను పూర్వపు విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు మహబూబ్‌భాష, ఇస్మాయిల్, షరీఫ్, ఓబులేసు, విజయచంద్రుడు, షఫి, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్గాలో మంత్రి పూజలు

బనగానపల్లె అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ని హజరత్ అహ్మద్ బాషా ఖాద్రి దర్గాలో ఆదివారం నిర్వహించిన గం ధం ఉర్సు మహోత్సవాల్లో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. దర్గా లో పూల చద్దర్ సమర్పించి మంత్రి మొక్కులు తీర్చుకున్నారున. ముస్లిం మత పెద్దలను, గురువులను మంత్రి బీసీ శాలువాలతో సత్కరించారు.

టీడీపీతోనే కార్యకర్తలకు న్యాయం: చైర్మన్ కాట్రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి

బనగానపల్లె అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే కార్యకర్తలకు న్యాయం జరిగిందని బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అనంతరం కాట్రెడ్డి మాట్లాడుతూ వైసీపీ హయంలో తాను ఎన్నో ఏళ్లు సేవలందించినా తనకు న్యాయం జరుగలేదన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరి గత ఎన్నికల్లో ఎమ్మెల్యే బీసీ గెలుపుకు కృషి చేశామన్నారు. తన సేవలను గుర్తించి తనకు మార్కెట్ యార్డు పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్‌యార్డును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు బివీ.పక్కీరారెడ్డి, కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, పీవీ.కుమార్‌రెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, సంగుశ్రీనివాసరెడ్డి, గుండం మల్లికార్జనరెడ్డి, మొట్ల రామిరెడ్డి, కాశీంబాషా బురానుద్దీన్, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్‌గా కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, వైస్ చైర్మన్‌గా కొండు నడిపి భూషన్న, పాలకవర్గ డైరక్టర్లుగా గుండం మల్లిఖార్జనరెడ్డి, వై.పవన్‌కుమార్‌రెడ్డి, బీ.పర్వీన్, తెలుగు ఎల్లేశ్వరీ, సరస్వతి, పెద్ద దస్తగిరమ్మ, రాధిక, ఎం.పుల్లారెడ్డి, గంగిరెడ్డి సుజాత, తలారి లక్ష్మీదేవి, మహబూబ్‌బాషా, ఎం.రమణయ్య, డి.నర్సీబాయిలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరికి యార్డు సెక్రటరీ గోరంట్ల శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు.

మంత్రి సహకారంతో యార్డును అభివృద్ధి చేస్తా


ప్రమాణస్వీకారంచేస్తున్న కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మధులత

కోవెలకుంట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కోవెలకుంట్ల మండల యువ నాయకుడు సహకార సంఘం అధ్యక్షుడు గువ్వల సుబ్బారెడ్డి సహకారంతో కోవెలకుంట్ల మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ గెండెగాళ్ల మధులత అన్నారు. ఆదివారం బనగానపల్లె మార్కెట్‌యార్డు కార్యాలయంలో కోవెలకుంట్ల మార్కెట్ యార్డు చైర్మన్, వైస్‌చైర్మన్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ పదవిని 40ఏళ్ల రాజకీయ చరిత్రంలో ఒక దళిత మహిళకు ఇవ్వడం జరిగిందని, అది బీసీ జనార్దన్‌రెడ్డి కృషి వల్లనే అని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈపదవి అప్పగించిన మంత్రి బీసీకి ధన్యవాదాలు తెలిపారు.

- కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం బనగానపల్లె మార్కెట్‌యార్డులో నిర్వహించారు. చైర్మన్‌గా గెండేగాళ్ల మధులత, వైస్ చైర్మన్‌గా నందిరెడ్డి విష్ణుశేఖర్‌రెడ్డి, డైరక్టర్లుగా ఎల్లానాగేంద్రమ్మ, చెదుర్ల శివశంకర్‌రెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మల్లుసుజాత, నల్లగట్ల ఇందిరమ్మ, రాజేశ్వరి, ఎస్.సాహిబ్‌బాషా, వీరమ్మ, డి.లక్ష్మీసుధ, బోయచంద్ర, గౌర చెన్న కృష్ణుడు, మంద విజయ్, మానిపాటి సంధ్యలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఐఎన్.పక్కీరెడ్డి, పొట్టిపాడు సర్పంచ్ గువ్వల సుప్రియ, జిల్లా మైనార్టీ నాయకుడు ఎస్‌ఏ గఫూర్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, గువ్వలసుందర్‌రెడ్డి, బీజేపీ మండల నాయకుడు లోకేశ్వరరెడ్డి, కమలపురి సర్పంచ్ జయమ్మ, బత్తులప్రతాప్‌రెడ్డి, బెలుం సురేశ్‌రెడ్డి, రేవనూరు నాగిరెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సంజామల: బనగానపల్లెలో ఆదివారం జరిగిన కోవెలకుంట్ల, బనగానపల్లె మార్కెట్‌యార్డ్ చైర్మన్ల ప్రమాణస్వీకారోత్సవానికి మండలంలోని టీడీపీ నాయకులు భారీగా తరలి వెళ్లారు. కానాల కేశవ రెడ్డి, సంజామల పెండేకంటి కిరన్ కుమార్, మల్కిహుసేన్, గిద్దలూరు ప్రతాప్ రెడ్డి, పేరుసోమల శ్రీనివాస్ చౌదరి, ఆల్వకొండ బాబు, లింగమదిన్నె ప్రతాప్ రెడ్డి, ముక్కమళ్ల మూసాని చంద్రశేఖర్ రెడ్డి, కమలపురి సర్పంచ్ విజయలక్ష్మి, రామిరెడ్డిపల్లె నుండి మంచాల మద్దలేటి రెడ్డి, నట్లకొత్తూరు మోహన్ రెడ్డి, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు.

వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత


ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ముక్తర్‌బాషా తెలిపారు. ఆదివారం వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా ఆహోబిలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం 1972 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో శ్రీనివాసరెడ్డి, రామక్రిష్ణ, మదన్ గోపాల్, ఎఫ్‌బీఓ ప్రొపెక్షన్ వాచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.